సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 24 । జూలై । 2023




**గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం**

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే అన్నారు. 8లో



**వ్యాధుల పట్ల అప్రమత్తత** 8లో

గ్రామాల్లో వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య సూచించారు.



**జలవిద్యుత్ కేంద్రాలకు ఊరట**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు పెరగడం జలవిద్యుత్ కేంద్రాలకు ఊరట నిస్తోంది. 8లో

## న్యూస్‌రీల్

### మోదమ్మ దర్శనానికి భారీగా భక్తులు



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి దర్శనానికి భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేసింది. అలాగే ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడి వద్ద కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.మొక్కులు తీర్చుకుని కాఫీతోటల ప్రాంతాల్లో కుటుంబ సమేతంగా వంటలు చేసుకున్నారు.

### మత్తు వైద్యుడు బాధ్యతల స్వీకరణ



డాక్టర్ మాదేటి గౌతమ్

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో మత్తువైద్యుడిగా మాదేటి గౌతమ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

### కోతి దాడిలో గిరి విద్యార్థికి గాయాలు

రాజవొమ్మంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కన గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి లోకేష్ కోతి దాడిలో గాయపడ్డాడు. పాఠశాల ప్రాంగణంలో తోటి విద్యార్థులతో ఆడుకుంటుండగా కోతి దాడి చేసింది. గాయపడిన అతనిని వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు.

### వాగుల్లో వరద ఉధృతి



కూనవరంలో గోదావరి, శబరి సంగమం వద్ద వరద ఉధృతి

కూనవరం: భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టిందన్న సమాచారంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎగువున కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగుతూ ఉభయ నదులైన గోదావరి, శబరి నదుల్లోకి కొత్తనీరు చేరడంతో కూనవరం వద్ద నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. రాత్రి ఏడు గంటలకు 17.92 మీటర్లు (40.55 అడుగులు) నమోదైంది. నది నీటిమట్టం నిలకడగా ఉండవచ్చని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. కొండ్రాజుపేట కాజ్‌వేపై వరదనీరు నాలుగవ రోజు కూడా కొనసాగుతోంది. దీనివల్ల టేకుల బోరు నుంచి కొండ్రాజుపేట, పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

# ముంగిట్లో సత్వర వైద్యం

ప్రభుత్వం పల్లె ప్రజలకు ఇంటింటా సత్వర వైద్యసేవలు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం మంచి ఫలితాలు ఇస్తున్నాయి. దీర్ఘకాలిక వ్యాధులతో ఇళ్లకే పరిమితమైన వారికి బాసటగా నిలుస్తున్నాయి. నేరుగా వైద్యులు వారి వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించడంతో అవస్థలు తప్పాయి. – సాక్షి, పాడేరు




**హుకుంపేట మండలం సూకూరు గ్రామానికి చెందిన ఈమె పేరు గత్తుమ్ తౌడమ్మ.. రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడు**తోంది. గతంలో ఆమెను 14 కిలోమీటర్ల దూరంలోని పాడేరు ఆస్పత్రికి కుటుంబ సభ్యులు ఆటోలో తీసుకువెళ్లేవారు. ఇందుకు రెండు పక్కలా రవాణా చార్జీలు రూ.200 వరకు ఖర్చు అయ్యేవి. ఉదయం వెళ్తే మధ్యాహ్నానికి ఇంటికి వచ్చేవారు. ఇలా ఇబ్బందులు పడుతున్న వారికి ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులోకి రావడంతో అవస్థలు తప్పాయి. వైద్యులు నేరుగా 15 రోజులకొకసారి ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన మందులు అందజేస్తుండటం వల్ల కష్టాలు తప్పాయి. ఆరోగ్యం కూడా కుదుట పడిందని తౌడమ్మ తెలిపింది. ఇంటివద్దకే వైద్యసేవలు కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఆమె పేర్కొంది. ఇలా తౌడమ్మ మాదిరిగా ఎంతో మంది వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వల్ల ప్రయోజనం పొందుతున్నారు.

మారుమూల గ్రామాల ప్రజలు గతంలో అనారోగ్య సమస్యలు తలెత్తితే మండల, నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, పాడేరులోని జిల్లా ఆస్పత్రిపై ఆధారపడాల్సి వచ్చేది. గత ప్రభుత్వంలో పాలకులు సర్కారు వైద్యంపై పూర్తి నిర్లక్ష్యం చేయడంతో వారు చాలా ఇబ్బందులు పడేవారు. దీర్ఘకాలిక రోగుల పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది

**వైద్యరంగంలో సంస్కరణలతో..**

గిరిజన ప్రాంతాల్లో మారుమూల గ్రామాల గిరిజనులకు మెరుగైన వైద్యసేవల విషయంలో అనేక ఇబ్బందులు ఉండేవి. గ్రామాల్లో ఆర్‌ఎంపీ, ప్రైవేట్ వైద్యులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. అంచెలంచెలుగా పూర్తిస్థాయిలో వైద్య సేవలతోపాటు, వైద్యులు, నిపుణులను అందుబాటులోకి తెచ్చింది. దీనిలో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానం మారుమూల గ్రామాల గిరిజనులకు ఎంతో మేలు చేస్తోంది.




- విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్‌తో తప్పిన అవస్థలు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బాసట
- నేరుగా ఇళ్లకు వెళ్లి సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది
- వైద్యరంగంలో సంస్కరణలపై సర్వత్రా హర్షం

దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఇంటివద్దనే వైద్యపరీక్షలతోపాటు సత్వర వైద్యం అందుతోంది. దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లేందుకు వ్యయప్రయాసలు తప్పాయి.



వైద్యసేవలు అందించేందుకు నాటుపడవపై దొరగూడ వెళ్తున్న వైద్యసిబ్బంది

**నిరంతరం సేవలందిస్తూ..**

జిల్లాలోని 22 మండలాల పరిధిలో 297 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు నిరంతరం సేవలందిస్తున్నాయి. అన్ని హెల్త్ క్లినిక్‌లకు భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికి 50 వరకు భవన నిర్మాణాలు పూర్తికాగా మిగిలిన చోట నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే వీటి నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉప ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాల భవనాలను తాత్కాలికంగా ఉపయోగిస్తూ పల్లె ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు.

**అందుబాటులో 128 మంది వైద్యులు**

జిల్లాలోని 22 మండలాల పరిధిలో 10,08,593 మంది జనాభాకు సంబంధించి గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యసేవలు అందించేందుకు 128 మంది వైద్యులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

- 104 సేవలు అందించేందుకు 33 వాహనాలను ప్రభుత్వం సమకూర్చింది. ఐటీడీఏలకు సంబంధించి 66 అంబులెన్సులు, 108కు సంబంధించి 12, టీబీ ఎక్స్‌ప్రెస్ 33 అంబులెన్స్‌లు, ఫీడర్ అంబులెన్స్‌లు 69 ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులను వెనువెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తున్నారు.
- సుమారు 878మంది పారామెడికల్ సిబ్బంది, 553మంది ఏఎన్‌ఎంలు, 3,848 ఆశా కార్యకర్తలు వైద్యులతో కలిసి ఆయా గ్రామాలను సందర్శిస్తూ ఇంటింటా వైద్యసేవలు అందిస్తున్నారు.
- ప్రతినెలా జిల్లాలో 1914 వైద్య శిబిరాల ద్వారా 82, 315 మందికి వైద్యసేవలు అందిస్తున్నారు, మధ్యాహ్న సమయంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని బాలబాలికలకు వైద్య సేవలు అందిస్తున్నారు.



చింతూరు ప్రాంతంలో వృద్ధురాలికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

**జిల్లా సమాచారం**

| | | |
|---|---|---|
| మండలాలు | : | 22 |
| జనాభా | : | 10,08,593 |
| వైద్యులు | : | 128 |
| పారామెడికల్ సిబ్బంది | : | 878 |
| ఏఎన్‌ఎంలు | : | 553 |
| ఆశా కార్యకర్తలు | : | 3,848 |
| నెలలో వైద్య శిబిరాలు | : | 1914 |
| వైద్యం పొందిన వారు | : | 82, 315 |

**ఎంతో శ్రమిస్తూ..**

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో గిరిజనులకు వైద్యసేవలందించేందుకు వైద్య బృందాలు ఎంతో శ్రమిస్తున్నాయి. కొండవాగులు, గెడ్డలను దాటుకుంటూ ప్రాణాలకు తెగించి గిరిశిఖర గ్రామాలకు చేరుకుని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారు.

- ఫ్యామిలీ డాక్టర్‌తో గర్భిణులు, దీర్ఘకాలిక రోగులు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతోంది. 104 వాహనంతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వద్ద అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నందున సత్వర వైద్యసేవలు అందుతున్నాయి. బీపీ,షుగర్,ఇతర రక్తపరీక్షల వివరాలను క్షణాల్లో తెలియజేస్తూ అత్యవసర వైద్యాన్ని అందిస్తున్నారు.



ఒడిశా సరిహద్దులోని గొప్పల వలసలో గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందాలు

### గోదావరి వరద పరిస్థితుల పరిశీలన



బోటుపై గోదావరి వరద పరిస్థితులను పరిశీలిస్తున్న ఏఎస్పీ జగదీష్ హడహళ్లి

దేవీపట్నం: గోదావరి వరద పరిస్థితులను రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆదివారం పరిశీలించారు. మండలంలోని దండంగి, పోశమ్మగండి తదితర ప్రాంతాలను సిబ్బందితో కలసి బోటుపై వెళ్లారు. వరద తగ్గేంతవరకు గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు, గోదావరి చూసేందుకు ఎవరూ రావొద్దని సూచించారు. గోదావరి చెంతకు వెళ్లొద్దని స్థానికులు, దుకాణదారులకు ఆయన సూచించారు. పోశమ్మగండి, దామనపల్లి, దండంగి వద్ద పోలీస్ పికెట్లను ఏర్పాటుచేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. దేవీపట్నం పోలీస్‌స్టేషన్ వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. రంపచోడవరం సీఐ సురేష్‌బాబు, దేవీపట్నం ఎస్‌ఐ కేవీ నాగార్జున సిబ్బంది పాల్గొన్నారు.

### మన్యంలో మంచు వాన

- ఏజెన్సీలో భిన్న వాతావరణం



పెదబయలు మండలం వన్నడ మార్గంలో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో ఆదివారం భిన్న వాతావరణం నెలకొంది. ఒక పక్క పొగమంచు, మరో పక్క వాన జల్లులు కురిశాయి. పాడేరు ఘాట్‌తో పాటు కించూరు,డల్లాపల్లి చింతపల్లి మండలంలోని లంబసింగి ఘాట్, పెదబయలు మండలంలోని కిముదుపల్లి, గోమంగి, గుల్లెలు పంచాయతీ పరిధిలో పొగమంచు అందాలు కనువిందు చేశాయి. కిముదుపల్లి నుంచి గోమంగి వెళ్లే రోడ్డులోని వన్నడ ఘాట్ వద్ద జోరు వాన, దట్టమైన పొగమంచుతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

# పెరుగుతున్న గోదావరి.. శబరి

**నాలుగో రోజూ నిలిచిన రాకపోకలు**

చింతూరు: విలీన మండలాల్లో స్వల్పంగా తగ్గిన గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు ఆదివారం మళ్లీ పెరిగాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో గోదావరి పెరగడంతో కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో వరద పెరిగింది. గోదావరి ఉధృతికి ఎగపోటుకు గురవడంతో చింతూరు మండలంలో శబరినది కూడా క్రమేపీ పెరుగుతోంది. శనివారం కొంత మేర తగ్గి కొన్ని ప్రాంతాలకు రాకపోకలు మెరుగుపడగా ఆదివారం మళ్లీ పెరగడంతో తిరిగి రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు మండలంలో సోకిలేరు, జల్లివారిగూడెం, చీకటివాగుల వరద రహదారిపైనే నిలిచి ఉండటంతో వరుసగా నాలుగోరోజు కూడా చింతూరు, వీఆర్ పురం మండలాల నడుమ, చింతూరు మండలంలోని 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.



చింతూరు, వీఆర్‌పురం రహదారి పైనుంచి ప్రవహిస్తున్న చీకటివాగు నీరు



వరద ప్రభావిత కుమ్మూరులో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

**ముమ్మరంగా వైద్యశిబిరాలు**

ముంపు ప్రభావిత ప్రాంతాల్లో జ్వరపీడితులు పెరుగుతున్న దృష్ట్యా వైద్యశిబిరాలు నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా ఆదేశించారు. వరద చుట్టుముట్టిన గ్రామాల్లో జ్వరాల కేసులు నమోదవుతున్నారు. వారు వైద్యంకోసం ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల్లో ముమ్మరంగా వైద్యశిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక చేపట్టాలని అధికారులు ఆదేశించారు. దీంతో ఆదివారం పలుచోట్ల వైద్యశిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

**లైఫ్‌జాకెట్లు తప్పనిసరి**

అత్యవసర పరిస్థితుల్లో నడుపుతున్న పడవల్లో ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా లైఫ్‌జాకెట్లు ధరించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్న బోట్ల యజమానులు ఈ జాగ్ర

# వోల్ఫ్‌స్నేక్ కలకలం

- గ్రామస్తుల చేతిలో హతం

చింతూరు: మండలంలోని నిమ్మలగూడెంలో పసుపురంగు మచ్చలతో ఉన్న వింతపాము కలకలం సృష్టించింది. శనివారం రాత్రి సమయంలో పాము ఇళ్లలోకి వెళ్లే ప్రయత్నం చేయగా గమనించిన గ్రామస్తులు దానిని వెంటనే హతమార్చారు. పసుపురంగు మచ్చలతో ఉన్న ఈ పామును వోల్ఫ్‌స్నేక్ అంటారని, ఇది చాలా ప్రమాదకరమని అటవీశాఖ అధికారి ఒకరు తెలిపారు. హతమార్చిన పామును గ్రామస్తులు దహనం చేశారు.



హతమైన వోల్ఫ్‌స్నేక్

# పులి దాడిలో ఆవు మృతి

చింతూరు: పులిదాడిలో ఆవు మృతిచెందిన ఘటన మండలంలోని చొలూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొడియం సీతారామయ్య అనే గిరిజన రైతుకు చెందిన ఆవు మేతకోసం శనివారం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు ఆవు మృతిచెంది ఉండటాన్ని గమనించి రైతుకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆవు కళేబరంపై బలమైన గాయాలు కనిపించడంతో పులిదాడి వల్లే మృతి చెందినట్టు గ్రామస్తులు నిర్ధారించారు. ఇటీవల కొన్ని రోజుల వ్యవధిలో చొలూరుకు చెందిన పొడియం దేవయ్యకు చెందిన రెండు, పొడియం వెంకటేష్, గంగయ్య, మిట్టవాడకు చెందిన మడివి ముత్తయ్యకు చెందిన ససుండే పశువులు కనిపించకుండా పోయాయని వారు వెల్లడించారు. అవికూడా పులిదాడిలో మృతి చెంది ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. పులిదాడి విషయం తెలిసి సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై చింతూరు అటవీ రేంజర్ మోహిని విజయలక్ష్మిని వివరణ కోరగా పులిదాడి విషయం ఇంకా తన దృష్టికి రాలేదన్నారు. సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరిస్తామని, అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొన్నారు.



మృతిచెందిన ఆవు



గతంలో చింతూరు అటవీప్రాంతంలో సీసీ కెమెరాకు చిక్కిన చిరుతపులి (ఫైల్)

## క్లుప్తంగా

### కారు బైక్ ఢీ ... బయటపడిన గంజాయి


కారు బైక్ ఢీకొన్న ఘటనలో కారు ముందు భాగం నుంచి బయటపడ్డ గంజాయి

**అనంతగిరి :** మండల కేంద్రం సమీపంలోని మలుపువద్ద ఆదివారం ఉదయం కారు బైక్ ఢీకొనగా, కారు ముందు భాగం నుంచి గంజాయి బయటపడింది.. స్థానికులు అందించిన వివరాలివి. అరకులోయ వైపు నుంచి మైదాన ప్రాంతానికి వెళుతున్న కారు మండల కేంద్రం లోగల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగంలో ఉన్న గంజాయి బయట బయపడింది. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయికు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలను వెల్లడించాల్సి ఉంది.

### వ్యాధుల పట్ల అప్రమత్తత

**ఎటపాక:** వర్షాలు, వరద కారణంగా గ్రామాల్లో వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య సూచించారు. ఆదివారం నెల్లిపాక పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతీ ఇంట్లోని జ్వరపీడితుల వివరాలు సేకరించారు. వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వరదల నేపథ్యంలో గ్రామాల్లో జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సూచించారు. దోమ తెరలు వినియోగించడంతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ ప్రత్యూష, ఎంపీటీసీ బూరం అంజలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


గిరిజనులకు రాయితీ యంత్రాలు పంపిణీ చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే,ఐటీడీఏ పీవో అభిషేక్


గురుకుల కళాశాలలో పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కార్యదర్శి కాంతిలాల్ దండే

- గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే
- చింతపల్లి మండలంలో పర్యటన
- గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనుల పరిశీలన

**చింతపల్లి రూరల్ :** గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే అన్నారు.ఆదివారం మండలంలో పర్యటించిన ఆయన లంబసింగిలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎకో పల్పింగ్ యూనిట్‌ను సందర్శించారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను రైతుల నుంచి తెలుసుకున్నారు. రూ.1.3కోట్లతో నిర్మిస్తున్న కాఫీ గోదాంను ఆయన పరిశీలించారు. అనంతరం హెచ్ఎన్‌టీసీకి చేరుకున్న ఆయన రాయితీపై ప్రభుత్వం అందజేస్తున్న యంత్రాల వల్ల కలిగే ప్రయోజనాలను గిరిజనుల నుంచి తెలుసుకున్నారు. పసుపు రైతులకు రాయితీపై మినీ బాయిలర్లు, మినీ యంత్రాలు, సీసీడీసీ పథకంలో భాగంగా పవర్ వీడర్లు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో మినీ బాయిలర్లు 464, మినీ పాలిషార్లు 193, పవర్ వీడర్లు 534 పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థుల భోజనాలు, వసతి గృహాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. వారి నుంచి సరియైన సమాధానాలు చెప్పలేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇలా చదివితే ఒక్కరు కూడా పాసవ్వరని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ట్రైకర్ ఎండీ ఈఈ రవీంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్, ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారులు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, పీహెచ్‌వో ఎస్.అశోక్, ఈఈ డీవీఆర్ఎం రాజు, ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి, ఎంఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

**వర్షాన్ని లెక్కచేయకుండా..**

**జి.మాడుగుల:** మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో వర్షానికి లెక్కచేయకుండా చిత్తడిచిత్తడిగా ఉన్న మట్టి రోడ్డులో ప్రయాణిస్తూ ఆదివారం గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి కాంతిలాల్ దండే సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో మారుమూల బొయితిలి పంచాయతీలో గల ఎస్‌సీఏ నిధులు రూ.2.20కోట్లుతో కోడిమామిడి గెడ్డపై వంతెన నిర్మాణాన్ని, బొయితిలి–కోడిమామిడి వరకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.2 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులు, చెల్లింపుల విషయాలను తెలుసుకున్నారు. ఎస్‌సీఏలో మరో రూ.వంద కోట్లు మంజూరు చేసేందుకు అవకాశం ఉందని ఆయన అన్నారు. గురుకులం పాఠశాల ఆవరణలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న అదనపు పాఠశాల భవనాన్ని ఆయన పరిశీలించారు. కంబాలుబయలు గ్రామ సమీపంలో ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ నిర్మాణ పనులుపరిశీలించారు. ఏకలవ్య పాఠశాలను ఆయన సందర్శించారు. విద్య, వసతులపై విద్యార్థినులతో మాట్లాడారు. గురుకుల కళాశాలను ఆయన సందర్శించారు. రూ.1.12కోట్లుతో నిర్మించిన అదనపు భవనాలను ఆయన పరిశీలించారు. గురుకుల కళాశాలలో విద్యార్థుల(మెనూ) వంటకాలను ఆయన పరిశీలించారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఈఎన్‌సీఎస్ శ్రీనివాస్, ఐటీడీఏ ఏపీవోలు వీఎస్ ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీడీ కొండలరావు, డీఈ అనుదీప్, వంశీ, ఏఈ దేవుడు, గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాళ్లు పారాయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

**ఏకలవ్య భవన నిర్మాణాలు వేగవంతం**

**దుంబ్రిగుడ:** ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ రర్యాదర్శి కాంతిలాల్ దండే ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రం దుంబ్రిగుడను సందర్శించిన ఆయన ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వచ్చే నెల 15వ తేదీలోపు ప్రారంభించి జాతీయ జెండా ఎగురవేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీవో అభిషేక్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జలవిద్యుత్ కేంద్రాలకు ఊరట

**ముంచంగిపుట్టు:** ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి.కొద్ది రోజులుగా సరిహద్దులో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు జలాశయాల్లోకి వచ్చి చేరుతోంది.

**డుడుమ, జోలాపుట్టులో..**

డుడుమ జలాశయ నీటిమట్టం 2,590 అడుగులు కాగా ఆదివారం నాటికి 2580.90 అడుగులు నమోదైంది. డుడుమ జలాశయ ఎగువన ఉన్న జోలాపుట్టు జలాశయ నీటి మట్టం సైతం క్రమేపీ పెరుగుతూ వస్తోంది. జోలాపుట్టు జలాశయ నీటి సామర్థ్యం 2750 అడుగులు కాగా ఆదివారం నాటికి 2701.60 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజుకు 2696.05 అడుగులు నీటి నిల్వ ఉండేది. గత ఏడాదితో పోలిస్తే ఐదు అడుగులు నీటి నిల్వ ఎక్కువగా ఉంది. 254.63 క్యూసెక్కుల నీరు జోలాపుట్టు జలశయంలోకి చేరుతోంది. దీంతో అప్రమత్తమైన జలాశయ సిబ్బంది జోలాపుట్టు జలాశయం నుంచి రెండు గేట్లను పైకెత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని దిగువనున్న డుడుమ జలాశయానికి విడుదల చేస్తున్నారు.


జోలాపుట్టు జలాశయం నుంచి డుడుమకు విడుదల అవుతున్న నీరు

**ప్రమాదస్థాయికి చేరేలా..**

వర్షాలు ఇలాగే కొనసాగితే జోలాపుట్టు, డుడుమ జలాశయాలకు ప్రమాదస్థాయికి చేరే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రాజెక్టు అధికారులు, జలాశయ సిబ్బంది నిరంతరం నీటిమట్టాలను పర్యవేక్షిస్తూ సాధారణ స్థాయికి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఆరు జనరేటర్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. వీటి ద్వారా 119 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని మాచ్‌ఖండ్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

# ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- చిన్నారి మృతి
- ఆమె తల్లికి తీవ్ర గాయాలు

**సాక్షి,పాడేరు:** స్థానిక పాలిటెక్నిక్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడు నెలల చిన్నారి మృతి చెందింది. ఆమె తల్లికి తీవ్ర గాయమైంది. ఆదివారం సాయంత్రం 6గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన కిల్లో పుష్పవతి, కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో పాడేరు నుంచి స్వగ్రామం బయలు దేరారు. పాలిటెక్నిక్ కళాశాల వద్దకు వచ్చేసరికి ఆటోను ఎదురుగా వస్తున్న పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో చిన్నారి కిల్లో అన్విత తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆమె తల్లి పుష్పవతి కాలు విరిగిపోవడంతో తీవ్రంగా గాయపడింది. పాడేరు ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


బోల్తా పడిన ఆటో, (ఇన్‌సెట్) చిన్నారి మృతదేహం



## గిరిజనుల జీవన సౌందర్యం అమోఘం

- ఉపముఖ్యమంత్రి రాజన్నదొర
- ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవాలు



కళాకారులతో నృత్యం చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి

**బీచ్‌రోడ్డు:** గిరిజనుల జీవన సౌందర్యం అమోఘమని ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గిరిజనోత్సవం ముగింపు వేడుకలను ఆదివారం వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించారు. గిరిజన సాంస్కృతి సంప్రదాయలు కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని రాజన్నదొర పేర్కొన్నారు. ఈ ఏడాది జరగబోయే ఆదివాసీ దినోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రపంచానికి జీవన శైలి, వారి పండగలు, ఆహార అలవాట్లను తెలుసుకునేందుకు ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీసీఆర్ టీఎం మిషన్ డైరెక్టర్ రవీంద్రబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన గిరిజన చిత్రాలను వీక్షిస్తున్న యువతులు


గిరిజనుల నృత్య ప్రదర్శన

**కళాకారులతో నృత్యం చేసిన రాజన్న**

గిరిజన ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులతో డిప్యూటీ సీఎం రాజన్న దొర, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి నృత్యం చేసి అలరించారు.

## పాఠశాల భవన సమస్యకు పరిష్కారం

- స్పందనలో అర్జీకి స్పందించిన ఐటీడీఏ పీవో అభిషేక్
- బడి మరమ్మతు పనులకు రూ.2లక్షలు

**ముంచంగిపుట్టు:** మండలం సుజనకోట పంచాయతీ నర్సీపుట్టు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 34 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. పాఠశాల గోడలు పైకప్పు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్ వెంగడ రమేష్, ఎంపీడీవో రమేష్‌లు స్థానికులతో కలిపి పాడేరులోని జరిగిన స్పందన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై తక్షణమే ఆయన స్పందించి ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారులకు నర్సీపుట్టు పాఠశాలకు పంపించి పాఠశాల మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రతిపాదనలకు అనుగుణంగా పాఠశాల భవనం మరమ్మతు పనులకు రూ.2లక్షలు మంజూరు చేశారు. దీంతో పాటు గడప గడప నిధులు పంచాయతీ నుంచి రూ.50వేలు సైతం ఉపయోగించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు శ్రమదానంతో పనులు చేశారు. ఇటీవల ఐటీడీఏ పీవో అభిషేక్ సైతం వచ్చి పనులను పరిశీలించారు. తమ పిల్లలకు భవన సమస్య తీర్చడంపై గ్రామ గిరిజనులు పీవో అభిషేక్‌కు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు.


మరమ్మతులు పూర్తయిన నర్సీపుట్టు పాఠశాల భవనం

# పండ్ల సాగుకు 'ఉపాధి' తోడు

- పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
- ఉపాధి హామీ నిధులతో ప్రోత్సాహం
- పూర్తి రాయితీ కల్పిస్తూ సహకారం

**అరకులోయ టౌన్:** గిరి రైతులు వాణిజ్య, కూరగాయల పంటల కన్నా పండ్లతోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుండటంతో ఉత్సాహంగా సాగు చేపడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదైన గిరిజన చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటలు పెంచేలా పూర్తిశాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో 2,516 మంది రైతులు 2,047 ఎకరాల్లో పండ్ల మొక్కలను నాటేందుకు సిద్ధం చేశారు. మామిడి, జీడిమామిడి, సపోట, కొబ్బరి, నారింజ, సీతాఫలం, నిమ్మ, జామ, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర రకాల సాగుపై గిరిరైతులు మొగ్గు చూపుతున్నారు. మరి కొంత మంది గిరిరైతులు మునగ సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పండ్ల తోటల సాగు చేస్తున్న గిరి రైతులు వేరు శనగ, కూరగాయలు, రాజ్మా, బొబ్బర్లు (అలసందులు) తదితర అంతర పంటలు సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందుతున్నారు.


డ్రాగన్ ఫ్రూట్ సాగు

**ఐదు ఎకరాలలోపు అర్హత**

పండ్లతోటల పెంపకానికి ఐదు ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు గిరిరైతులు అర్హులు. ఇప్పటికే ఏజెన్సీలో వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు తీసుకున్న గిరిరైతులు గోతులు తవ్వి, మొక్కలు నాటుకుంటున్నారు. మూడేళ్లపాటు మొక్కల సంరక్షణకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది, మొక్కల పంపిణీతోపాటు సంరక్షణకు మామిడి మొక్కకు రూ. 45, జామ గ్రాఫ్ట్‌కు రూ.30, జామ లేయర్‌కు రూ.20, నిమ్మకు రూ. 25, కొబ్బరికి రూ.60 చొప్పున మొక్కలు నాటుకున్న రైతుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని ఉపాధి హామీ ఏపీడీ పవన్ తెలిపారు.

### అవగాహన కల్పించాం

ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి అందించే సహకారాన్ని గిరి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై ఇప్పటికే వారికి అవగాహన కల్పించాం. పండ్ల మొక్కలు ఉచితంగా ఇవ్వడంతో పాటు మూడేళ్లపాటు సంరక్షణకు ప్రభుత్వం నగదు చెల్లిస్తుంది. అంతర పంటల సాగుకు ప్రోత్సహిస్తున్నాం. ఈ నెలాఖరుకి పండ్ల తోటల నాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పండ్ల తోటల పెంపకంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చు.

– పవన్, ఏపీడీ, అరకులోయ

### నారింజ సాగు చేపట్టా



మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలనే ఆసక్తితో ఎకరా విస్తీర్ణంలో 110 నారింజ (స్వీట్ ఆరంజ్) మొక్కలు నాటాను. శ్రమ ఎక్కువైనా తక్కువ సమయంలో అధిక లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఈ పంటకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అధికారుల నుంచి ఇస్తున్న ప్రోత్సాహం బాగుంది.

– కె.గుప్త, గిరిరైతు, ప్రధానిపూట్, పద్మాపురం పంచాయతీ, అరకులోయ

## మావోయిస్టు వారోత్సవాలపై కరపత్రాలు

**జి.మాడుగుల:** మావోయిస్టు వారోత్సవాలను ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు సీపీఐ మావోయిస్టు ఆంధ్రా–ఒడిశా స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి గణేష్ విడుదల చేసిన ప్రకటన స్థానిక విలేకరులకు అందింది. దేశంలో అర్ధ భూస్వామ్య విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో పోరాడుతూ ప్రాణాలను అంకితం చేసిన అమరుల త్యాగాలను స్మరిస్తూ సంస్కరణ సభలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సామ్రాజ్యవాదాన్ని సమూలంగా నిర్మూలించి వర్గ రహిత సమాజంగా కమ్యూనిజం నిర్మించాలనే మహోన్నత లక్ష్యంతో ఉద్యమాలు కొనసాగుతున్నట్టు తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సీపీఐ ఉద్యమాలను అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రకటనలో పిలుపునిచ్చారు.


మావోయిస్టులు విడుదల చేసిన కరపత్రం

# ప్రకృతి సాగు.. లాభాలు బాగు

**విరివిగా మోడల్ ప్లాంట్ల ఏర్పాటు**

**గంగవరం:** తక్కువ సాగు ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం, ప్రకృతి సాగు లాభసాటిగా ఉండడంతో మండలంలో రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై దృష్టిని సారించారు. మండలంలోని పిడతమామిడి, నెల్లిపూడి, మొల్లేరు, జగ్గంపాలెం, మర్రిపాలెం, మోహనాపురం, జడేరు ఏడు యూనిట్స్‌లో 14 గ్రామా పంచాయతీల్లో 31 గ్రామైక్య సంఘులలో మహిళలు సహకారంతో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. ఈ సంవత్సరం ఖరీఫ్ ఏక్షన్ ప్లాన్ లో భాగంగా 3520 మంది రైతులు సుమారుగా 5,500 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రధాన పంటలు అయినా వరి, జీడి మామిడి , పప్పుధాన్యాలు, కూరగాయలు తోటలు, చిరుధాన్యాలు సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు.

**అపరాల సాగుతో అదనపు ఆదాయం**

ప్రకృతి సాగులో వరి, పత్తి, కర్రపెంలం, చోళ్ల వంటి పంటలు, ఇతర అంతర పంటలు పండిస్తున్నారు. వీటిలో చాలా మంది రైతులు ప్రధాన పంటలుగా ఉన్న జీడిమామిడి, పామాయిల్ తోటల్లో సాగు చేస్తున్నప్పటికీ వాటిలో అంతర పంటలుగా అపరాలను సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగులో ఏటిఎం మోడల్ విధానం ద్వారా రైతులకు నిరంతరం ఆదాయం వచ్చే మార్గాలు ఉన్నందన ప్రకృతి వ్యవసాయం ద్వారా తీగజాతి, గడ్డిజాతి, దుంపజాతి ,ఆకుకూరలు, కాయగూరలు, సాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఏటిఎం పద్ధతిలో తీగజాతి, గడ్డిజాతి,దుంపజాతి ,ఆకుకూరలు, కాయకూరలు సాగుకు రైతులు ఎక్కువగా మగ్గుచూపుతున్నారు. పిడతమామిడి, మొల్లేరు క్లస్టర్‌లో అధికంగా రైతులు ప్రకృతి సాగుపై మగ్గుచూపుతున్నారు.


పిడతమామిడి గ్రామంలో ఆకుకూరల సాగు


పిడతమామిడిలో విత్తనాలు నాటుతున్న రైతులు

### అంతర పంటలతో మేలు



ఒక ఎకరంలో ప్రధాన పంటగా పామాయిల్ సాగు చేస్తున్నాను. అందులోని 18 రకాలు విత్తనాలు కలిపి దున్నడం ద్వారా అంతర పంటగా బెండ, నువ్వులు, మిరప, వంగ పండించాను. అలాగే 10 సెంట్లు భూమిలో మోడల్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఆకు కూరలు దుంప జాతి మొక్కజొన్న పప్పు ధినుసులు వేశాను. గత ఏడాది మినుము సాగు చేసి లాభం పొందా.

– జయరాజు, రైతు, పిడతమామిడి

### రసాయన ఎరువులకు దూరం



వ్యవసాయ సాగులో రసాయన ఎరువులు మానేసి, ప్రకృతి ఎరువులు తయారు చేసుకోవడంలో నేర్చుకున్నాం. స్థానికంగానే లభించే గోమూత్రం, ఆవుపేడ తక్కువ ఖర్చుతో కషాయాలు తయారు చేసుకుంటున్నాం. విత్తనాల శుద్ధికి బీజామృతం, భూమి సారవంతానికి, బలానికి ఘనాజీవామృతం వినియోగిస్తున్నాను. గ్రామంలో సుమారుగా 200మంది రైతులు ప్రకృతి సాగు చేస్తున్నాం.

– ఎం ధనచక్రరావు, రైతు, పిడతమామిడి

### రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వరిలో ప్రధానంగా శ్రీవరి, లైన్ సాయింగ్ విధానంతో రైతుకి ఖర్చు తక్కువ అయి దిగుబడి బాగుంటుంది. సుమారుగా 2000 మంది రైతులతో గులిరాగి పలు పంటలు విధానంలో నాటుకోవడానికి ఇంద్రావతి, వేగావతి వంటి రాగి విత్తనాల కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా విత్తనాలు పంపిణీ చేశాం.

– డాక్టర్ శ్రీనివాసరావు, డీపీఎంయూ, రంపచోడవరం